
సాక్షి ఒడిశా
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,25,841లు, బంగారం 100 గ్రాములు, వెండి 1 గ్రాము వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆవుల అక్రమ రవాణా

జయపూర్‌పట్టణంలో ఆవుల అక్రమ రవాణా జరుగుతోంది. స్థానికులు అడ్డుకున్నారు.

- 4లో.



ఆక్రమణల తొలగింపు

జయపురంలో ఆక్రమణల తొలగింపు జరిగంది. కాసింత ఉద్రిక్తత నెలకొంది.

- 4లో.

న్యూస్‌రీల్

యువజన కాంగ్రెస్ నేతలకు పరామర్శ



జైలు బయట మీడియాతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

కొరాపుట్: భువనేశ్వర్ జైలులో ఉన్న యువ జన కాంగ్రెస్ నాయకులను రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పరామర్శించారు. ఇటీవల రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ముట్టడి నిర్వహించింది. ఇందులో పాల్గొన్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి జైలులో పెట్టారు. ఈ నేపథ్యంలో క్యాడర్‌లో మనోధైర్యం పెంచడానికి ముఖ్య నాయకులు జైలును సందర్శించారు. అనంతరం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అజయ్‌కుమార్ లలూ మాట్లాడుతూ కేసులు పెడితే భయపడేది లేదన్నారు. అంతకుముందు లలూకు భువనేశ్వర్ ఎయిర్ పోర్టులో సీఎల్‌పీ నాయకుడు రాం చంద్ర ఖడం, జయదేవ్ జెన్నాలు స్వాగతం పలికారు.

జయపూర్ యువతికి సివిల్స్‌లో 48వ ర్యాంక్



కొరాపుట్: సివిల్స్ ఫలితాలలో జయపూర్‌కు చెందిన రిథిక రథ్‌కు 48వ ర్యాంక్ వచ్చింది. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కొరాపుట్ కలెక్టర్‌కు అభినందన



కొరాపుట్ జిల్లా కలెక్టర్ వీ.కీర్తి వాసన్ ని అభినందిస్తున్న సీఎం మోహన్ చరణ్ మఝి, డిప్యూటీ సీఎం ప్రభాతీ పరిడాలు

కొరాపుట్: కొరాపుట్ కలెక్టర్‌ను సీఎం మోహన్ చరణ్ మఝి, ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా అభినందించారు. బుధవారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో సీఎం, డిప్యూటీ సీఎంలను కలెక్టర్ వి.కీర్తివాసన్ మర్యాద పూర్వకంగా కలిశారు. కొరాపుట్ జిల్లాకు ప్రధాన మంత్రి అవార్డుని పీఎం నరేంద్ర మోదీ చేతుల మీదుగా కలెక్టర్ అందుకున్న విషయం విధితమే. ఈ అవార్డుతో కలెక్టర్ వచ్చారు. దీంతో కలెక్టర్‌ను సీఎం, డిప్యూటీ సీఎంలు అభినందించారు.

పెహల్గామ్ మృతులకు నివాళులు



మృతి చెందిన పర్యాటకులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాయగడ: జమ్ము కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రమూకల దాడిలో చనిపోయిన వారికి స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థలు, వాణిజ్య, నాగరిక మంచ్ తదితర సేవా సంస్థలు నివాళులు అర్పించాయి. ఈ మేరకు గాంధీ పార్క్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. కళింగ వైశ్యసంఘానికి చెందిన సభ్యులు క్యాండిల్ వెలిగించి నీరాజనాలు పలికారు. ఉగ్రమూకల ఉన్మాదాన్ని ప్రముఖులు ఖండించారు.


విషం తాగి మహిళ మృతి



మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రి వద్ద అపరజితా బిశ్వాస్ మృతదేహం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి మారివాఢ పంచాయతీ ఎంవీపీ 18 గ్రామానికి చెందిన సంజయ్ బిశ్వాస్ భార్య అపరజితా బిశ్వాస్ (32) మంగళవారం రాత్రి విషం తాగి మృతి చెందారు. సోమవారం సంజయ్‌కు అపరాజితకు మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె మంగళవారం విషం తాగేశారు. భర్త స్థానికుల సాయంతో ఆమెను కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మల్కన్‌గిరి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. అయితే అపరాజిత తండ్రీ విద్యాస్ మండల్ మాత్రం భర్తపైనే అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐఐసి హిమాంశు శేఖర్ బారిక్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అయ్యాక వివరాలు తెలుస్తాయని ఆయన తెలిపారు.

పెహల్గామ్‌లో.. ఒడిశా వాసి మృతి



ప్రశాంత్ శత్పతి



భార్యాబిడ్డలతో ప్రశాంత శత్పతి

భువనేశ్వర్: కాశ్మీర్‌లో సంభవించిన ఉగ్రవాదుల ఊచకోతలో రాష్ట్రానికి చెందిన శత్పతి (41) మృతి చెందారు. బైసరన్ గడ్డి మైదానంలో తన భార్య, తొమ్మిదేళ్ల కొడుకు కళ్ల ఎదురుగా ఉగ్రవాదులు ఆయనని కాల్చి చంపడంతో విషాదం నుంచి కోలుకోలేని పరిస్థితిలో కుటుంబీకులు తల్లడిల్లుతున్నారు. బాలాసోర్ జిల్లాలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్)లో అకౌంట్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రశాంత్ శత్పతి ఎల్టీసీపై తన భార్య, కొడుకుతో కలిసి కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. ప్రశాంత్ బాలసోర్ జిలా రెముణ మండలం ఇషానీ గ్రామస్తుడు. ఆయన మృతితో గ్రామంలో విషాదం అలముకుంది. బైసారన్‌లోని రోప్‌వే నుంచి కుటుంబీకులతో కలిసి దిగుతుండగా ప్రశాంత్ శత్పతి తలకు గురి పెట్టి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గంట తర్వాత సైన్యం వచ్చింది అని అతని భార్య ప్రియ దర్శిని ఆచార్య తెలిపారు.

ఊచకోతకు ఏబీవీపీ ఖండన

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన క్రూరమైన దాడిపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సభ్యులు తమ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో ప్రశాంత శత్పతి మృతిపై ఏబీవీపీ కార్యకర్తలు నిరసన ప్రదర్శించారు. స్థానిక ఫకీర్ మోహన్ అటానమస్ కళాశాల ఆవరణలో గుమిగూడి ఉగ్రవాద చర్యల పరిస్థితిని పరిష్కరించడానికి భారత ప్రభుత్వం త్వరగా, సమర్థంగా చర్యలు తీసుకోవాలని నిరసనకారులు నినాదాలు చేశారు. బాధితులకు సంఘీభావం తెలిపారు. న్యాయం జరిగేలా భారత ప్రభుత్వం తక్షణం దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

ఘటమెత్తిన లక్ష్మీపూర్ ఎమ్మెల్యే



ముత్యాలమ్మ ఘటం ఎత్తుతున్న లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత



పూరీలో క్షేత్ర పర్యటనలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

కొరాపుట్: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి కేంద్రంలో జరిగిన ముత్యాలమ్మ ఘట జాతరలో స్థానిక ఎమ్మెల్యే పవిత్ర శాంత ఘటం ఎత్తారు. ముగింపు ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. మొక్కుబడిగా ఘటం మోశారు. స్థానిక కళాకారులతో కలిసి నృత్యం చేశారు.

పూరీలో పర్యటన

కొరాపుట్: కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పూరిలో పర్యటిస్తోంది. కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క నేతృత్వంలో కమిటీ ఆయా ప్రాంతాలను సందర్శించింది. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణా ప్రాంతాల్లో అమలవుతున్న తీరుపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

దివ్యాంగులకు బ్రెయిలీ ఉపకరణాలు



అంధులకు డివైజ్‌లను అందజేస్తున్న నబరంగ్ పూర్ కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో

కొరాపుట్: దివ్యాంగులకు బ్రెయిలీ డివైజ్‌ల పంపిణీ జరిగింది. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో స్వయంగా దివ్యాంగ బాలలకు అందజేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాయంతో అన్నై స్మార్ట్ బ్రెయిలీ డివైజ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు.

భువనేశ్వర్ - పూరీ హైవే విస్తరణ



భువనేశ్వర్-పూరీ హైవే

భువనేశ్వర్: భువనేశ్వర్-పూరీ హైవే విస్తరణకు మార్గం సుగమం అయింది. ఈ మార్గం 6 వరుసలుగా విస్తరించడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదం మేరకు ఈ విస్తరణ వ్యయ ప్రణాళిక రూ.1,200 కోట్లు. దీని వల్ల ఈ మార్గంలో ప్రయాణ సమయం ముప్పావు గంటకు పరిమితం అవుతుంది. ఈ మార్గం 8 వరుసల విస్తరణతో సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీనివల్ల భువనేశ్వర్ పూరి మధ్య ప్రయాణ సమయం 90 నిమిషాల నుంచి 45 నిమిషాలకు తగ్గుతుంది. రాష్ట్ర రహదారులు త్వరలో అత్యున్నత నాణ్యత, స్థాయిలో అమెరికా రహదారులకు సమానంగా ఉంటాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భువనేశ్వర్, పూరీ మధ్య 8 లైన్ల రహదారి రాబోయే 100 ఏళ్ల అవసరాలను తీర్చగలదు అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మరో వైపు ప్రతిపాదిత తీరప్రాంత రహదారిని 4 వరుసలుగా విస్తరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు.

మహేంద్రతనయలో పడి వృద్ధుడు మృతి





మచ్చమర గ్రామం మహేంద్రతనయ నది వద్ద పోలీసులు, గ్రామస్తులు

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి మచ్చమర గ్రామంలో మహేంద్రతనయ నదిలో బుధవారం మధ్యాహ్నం ఒక వృద్ధుడు స్నానానికి వెళ్లి మునిగి మృతిచెందాడు. ఉప్పలాడ పంచాయతీ మచ్చమర గ్రామానికి చెందిన హనుమంత బాలకృష్ణ (62) నదికి స్నానం కోసం వెళ్లి మునిగి మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న గురండి పోలీసు ఐఐసీ ఓం ప్రకాష్ పాత్రో మచ్చమర గ్రామానికి విచ్చేసి అగ్నిమాపక దళం సిబ్బంది ద్వారా మృతదేహాన్ని బయటకు తీయించి పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బావిలో మునిగి ఇద్దరు యువకుల దుర్మరణం



తేతే టంగరంగ మృతదేహం



చిత్తరంజన్ టంగరంగ మృతదేహం

రాయగడ : బావిలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసేందుకు దిగిన ఇద్దరు యువకులు ఊపిరాడక మృతి చెందారు. మృతులు చంద్రపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బందిరి గ్రామంలో బుధవారం తేతే టంగరంగ(25), చిత్తరంజన్ టంగరంగ(28)లుగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకుతీశారు. కలిమావీధిలోని తాగునీటి బావిలో చెత్త పేరుకుపోవడంతో శుభ్రం చేసేందుకు చిత్తరంజన్, తేతేలు లోపలికి దిగారు. కొద్దిసేపటి తర్వాత ఒక్కసారిగా ఊపిరాడక విలవిల్లాడారు. బయటకు రాలేకపోవడంతో మృతి చెందారు. ఎప్పటికీ బయటకు రాకపోవడంతో స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు .

నిర్మాణ ప్రాజెక్ట్ మానిటరింగ్ డాష్‌బోర్డు ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పనుల శాఖ ప్రాజెక్ట్ మానిటరింగ్ డాష్‌బోర్డ్‌ను బుధవారం ప్రారంభించారు. ఇది వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వాస్తవ కార్యాచరణ (రియల్-టైమ్) పర్యవేక్షణకు వీలు కల్పిస్తుంది. ప్రాజెక్టుల దోషరహిత అమలును నిర్ధారించి సామర్థ్యం మెరుగుపరిచేందుకు దోహదపడుతుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. అధునాతన ఏఐ డాష్‌బోర్డ్ అన్ని ప్రధాన ప్రాజెక్టులతో సహా ప్రభుత్వ ఆస్తులు, కొనసాగుతున్న ప్రాజెక్టుల తాజా వీక్షణను అందిస్తుంది. జిల్లా, మండల స్థాయిలో ప్రాజెక్టుల గురించి వివరణాత్మక సమాచారం అనుక్షణం అందుబాటులో ఉంటుంది. ఈ ప్రాజెక్టులకు కచ్చితమైన స్థానాలను గుర్తించడానికి సమాచారానికి సంబంధించిన ఉపగ్రహ పటాలు చూసేందుకు వీలవుతుంది.

రైల్వే ప్రాజెక్టుల వేగవంతంపై దృష్టి



సమావేశానికి హాజరైన అధికారులు



ఎంపీ బోలభద్ర మాఝితో అధికారులు

మల్కన్‌గిరి: రైల్వే ప్రాజెక్టుల వేగవంతానికి అధికారులు కృషి చేయాలని నవరంగపూర్ ఎంపీ బోలభద్ర మాఝి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి కార్యకలాపాల సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టాంగులు, చిత్రకొండ ఎమ్మెల్యే మంగుఖీలో, జిల్లా అదనపు ఎస్పీ తాపాన్ నారాయణ్ రోతో, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర సభరో, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల శిక్షణ శిబిరం ప్రారంభం



జయపూర్‌లో హజ్ యాత్రికులతో మంత్రి నిత్యానంద గొండో



మంత్రితో ముస్లిం అంజుమన్ కమిటీ సభ్యులు

కొరాపుట్: కేంద్ర, రాష్ట్రాలలో మత సామరస్యమే తమ ప్రధాన లక్ష్యమని బీజేపీకి చెందిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ, మైనారిటీ, ప్రాథమిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండో ప్రకటించారు. జయపూర్ పట్టణంలోని సంధ్యా పంక్షన్ హాలులో హజ్ యాత్రికుల శిక్షణా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చరిత్రలో తొలిసారిగా కొరాపుట్‌లో ప్రభుత్వం హజ్ యాత్రికుల శిక్షణా శిబిరం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. 36 మంది యాత్రికులకు ప్రభుత్వం తరఫున శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జయపూర్ ముస్లిం అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మీర్జా ముస్తాఫా బేగ్, బీజేపీ నేత హిమాంశు మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

మరణించిన మూడు రోజులకు అంత్యక్రియలు



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొరాపుట్: ఓ గర్భిణి మరణించిన మూడు రోజులకు అంత్యక్రియలు జరిగాయి. మంగళవారం రాత్రి కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి ఉల్లా గ్రామ పంచాయతీ నెర్కాగుడ గ్రామానికి చెందిన మహేశ్వర్ పరజ భార్య ధనుమతి ముదలి (27) అంత్యక్రియలు జరిగాయి. ఈ నెల 16వ తేదీన 5నెలల గర్భిణి అయిన ధనుమతి పై భర్త మహేశ్వర్ తీవ్రంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన ధనుమతి పరిస్థితి విషమించింది. దాంతో భయపడి ఆమెని దశమంత్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ కోలుకోకపోవడంతో కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించాడు. ఈ నెల 20వ తేదీన ధనుమతి మృతి చెందింది. 21న మృతదేహాన్ని గ్రామానికి తెచ్చిన మహేశ్వర్ గ్రామస్తులు దాడి చేస్తారనే భయంతో గ్రామ సరిహద్దులో మృతదేహం వదలి పారిపోయాడు. గ్రామస్తులు మృతదేహంతో గ్రామంలో ఆందోళనకి దిగాడు. చివరకు పోలీసులు చేరుకొని నిందితుడిని అరెస్ట్ చేస్తామని చెప్పడంతో మంగళవారం రాత్రి అంత్యక్రియలు జరిగాయి.

సరిహద్దులో వన్య ప్రాణులు మృతి



చిరుత పులి మృత దేహం



అడవి దున్న మృతదేహం

కొరాపుట్: రాష్ట్ర సరిహద్దులో వన్య ప్రాణులు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. నబరంగ్‌పూర్ జిల్లా రాయగర్ సమితి సరిహద్దులో కాంకేర్ జిల్లా అటవీ ప్రాంతంలో ఈ ఉదంతాలు వెలుగులోనికి వచ్చాయి. విద్యుత్ వేటగాళ్లు అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి చిరుత పులి, అడవి దున్నలు మృతి చెందాయి. ఇది తెలిసి చత్తీస్‌గఢ్ అటవీ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి కష్టాలను పట్టించుకోరా?



బావి నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు



ఈ నీటినే తాగేందుకు వినియోగిస్తున్నామని చెబుతున్న మహిళ

రాయగడ :

ఓ వైపు భానుడి ప్రతాపం..మరోవైపు తాగునీటి ఎద్దడితో ప్రజలు విలవిల్లాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం తగదని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులకు లేఖ పంపించారు. కొద్దిరోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి మండుతున్న ఎండల నేపథ్యంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారని, అయినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మిరావలి గ్రామంలోని ఆదివాసీ, గౌడ వీధుల్లో సమస్య మరింత తీవ్రంగా ఉందన్నారు. గొట్టపు బావులు పాడై నెలలు గడిచినా పట్టించుకునే వారే కరువయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



మందస: మందస మండలం కుడుమాసాయ్ గిరిజన గ్రామంలో ఓ మహిళ అంబులెన్స్‌లో ప్రసవించారు. ఆమెకు బుధవారం పురిటి నొప్పులు రావడంతో 108కు కాల్ చేశారు. అంబులెన్స్‌లో ఆమెను తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో నొప్పులు అధికం కావడంతో వాహనంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇద్దరినీ హరిపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. 108 సిబ్బంది ఈఎంటీ ఉప్పాడ గోపాలకృష్ణ, పైలెట్ రామచంద్రారెడ్డి ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు



సభ ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలెంలో ఈ నెల 26వ తేదీన పర్యటించనున్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం పర్యవేక్షించారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న సభ, హెలీప్యాడ్ ఏర్పాటు, వాహనాలు పార్కింగ్, మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహణపై చర్చించారు.

పుస్తక ప్రదర్శన



జిల్లా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ పుస్తకం మంచి నేస్తం వంటిదని అన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు పుస్తకాలు తెప్పించడం జరిగిందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాని సూచించారు. ఈ ప్రదర్శనలో రామాయణం, మహాభారతం, ఇతిహాసాలు, నాటికలు, ఇయర్ బుక్స్, నిఘంటువులు, పోటీ పరీక్షలకు సంబంధించిన 200 రకాల పుస్తకాలు ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి వీవీజీఎస్ శంకరరావు, పై.మురళీ కృష్ణ, యు.కల్యాణి, టి.రాంబాబు, పి.రామ్మోహన్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కందుకూరి పురస్కార గ్రహీతలకు సత్కారాలు



కందుకూరి పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని వాసవీ కల్యాణ మండపంలో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో ఇటీవల కందుకూరి పురస్కారాలు అందుకున్న కళాకారులను బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. పురస్కారాలు అందుకున్న మెట్ట పోలినాయుడు, గుత్తు చిన్నారావులకు జ్ఞాపికలు, సన్మాన పత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు, సుమిత్రా కళాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి బాట..



టెక్కలిలో వసతి గృహం నుంచి తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు

టెక్కలి: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడంతో వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులంతా ఇంటి బాట పట్టారు. బుధవారం తరగతుల నిర్వహణ చివరి రోజు కావడంతో, సుదూర ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులంతా వసతి గృహాల వద్దకు చేరుకుని వారి పిల్లలకు సంబంధించి సామగ్రితో ఇంటి బాట పట్టారు. మళ్లీ జూన్ 12 న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

ఉగ్రదాడి హేయకరమైన చర్య



భువనేశ్వర్: సంతాపం తెలియజేస్తున్న పీసీసీ నేతలు



కొట్‌పాడ్‌లో అమరులకు నివాళులు అర్పిస్తున్న స్థానికులు

భువనేశ్వర్: జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద సంఘటనలో రాష్ట్రానికి చెందిన ప్రశాంత శత్పతి మరణం పట్ల రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తొలి సమావేశం వాయిదా వేసినట్లు అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ప్రకటించారు. ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను దారుణంగా హత్య చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ దుఃఖ సమయంలో బాలసోర్ రెముణాకు చెందిన ప్రశాంత్ శత్పతి కుటుంబానికి పీసీసీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ అజయ్ కుమార్ లల్లూ, పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్, పీసీసీ మాజీ అధ్యక్షులు నిరంజన్ పట్నాయక్, జయదేవ్ జెనా, శరత్ పట్నాయక్, ప్రసాద్ హరిచందన్, శ్రీకాంత్ జెనా తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: జయపూర్ ఎయిర్ పోర్టులో మాక్‌డ్రిల్

జయపూర్ ఎయిర్‌పోర్టులో అప్రమత్తత

కొరాపుట్: టెర్రరిస్ట్ దాడుల నేపథ్యంలో జయపూర్ ఎయిర్ పోర్టులో ముందస్తు అప్రమత్తత ప్రకటించారు. బుధవారం సాయంత్రం ఎయిర్‌పోర్టులో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రదాడులు, విమానాల హైజాక్ వంటి ఘటనల సమయంలో ఎలా వ్యవహరించాలో ప్రయాణికులకు తెలియజేశారు.

కొట్‌పాడ్‌లో అమరులకు నివాళులు..

పెహల్గాంలో టెర్రరిస్ట్ దాడుల్లో మృతి చెందిన వారికి కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ పట్టణంలో నివాళులు అర్పించారు. సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

భారీగా ఆవుల అక్రమ రవాణా



ఆవులతో వ్యాన్



ఆందోళన చేస్తున్న హిందూ సంస్థల ప్రతినిధులు

కొరాపుట్: ఆవుల అక్రమ రవాణాని ప్రజలు అడ్డుకున్నారు. మంగళవారం సాయంత్రం జయపూర్ పట్టణం లో జయనగర్ మీదుగా వరుసగా వాహనాలతో ఆవులు తరలించడాన్ని స్థానికులు గమనించారు. ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చి వాహనాలు అడ్డగించారు. అప్పటికే రెండు వ్యాన్లు ప్రజలను చూసి వేగంగా వెళ్లిపోయాయి. వెనుక ఉన్న 9 వ్యాన్లను ప్రజలు అదుపులోకి తీసుకున్నారు. వాటిని నడుపుతున్న డ్రైవర్లపై దాడికి దిగారు. ఇది తెలిసి హిందూ సంఘాల ప్రతినిధులు ఆందోళకు దిగారు. పోలీసు బలగాలు చేరుకుని ప్రజల నుంచి వాహన డ్రైవర్లను రక్షించారు. ఈ వాహనాలు కొరాపుట్ జిల్లాలోని జయంత్ గిరి నుంచి ఆంధ్రా బోర్డర్ లోని పాడువకి తరలిస్తున్నట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది.



జయపూర్ టౌన్ పోలీస్ స్టేషన్‌కి తరలించిన ఆవుల వాహనాలు



సంఘటన స్థలంలో పోలీసు వాహనాలు

ప్రకృతి వ్యవసాయంతో నేలకు మేలు

పాతపట్నం: ప్రకృతి సాగుతో అటు నేలకు, ఇటు పంటకు ఎంతో మేలు జరుగుతుందని తద్వారా రైతుకు ఆదాయం సమకూరుతుందని ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం ధనుంజయ అన్నారు. మండలంలోని మెట్టుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి సహజ సిద్ధ ఆహారంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి నుంచి పండించే బెల్లం, వేరు శనగ, కొర్రెలు, కారం, రాగులు, చింతపండు వంటి పదార్థాలు తీసుకోవడం వద్ద కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ మంచి ఆరోగ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని రైతులకు, మహిళా సంఘాలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ రేణుక, గోవిందరెడ్డి, శివాజీ, సువర్ణరావు, శ్రావ్య, భారతి, రైతులు పాల్గొన్నారు.



మెట్టుపేటలో రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయం పంటను పరిశీలిస్తున్న దృశ్యం

పునరావృతం కాకుండా చూడాలి



శ్రీకూర్మనాథాలయంలో తాబేళ్ల పార్కు వద్ద బీజేపీ నాయకులు

గార: శ్రీకూర్మం క్షేత్రంలో తాబేళ్ల దహనం వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. బుధవారం కూర్మనాథాలయానికి జనసేన నాయకుల తో కలసి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాబేళ్ల మరణానికి గల కారణాలు విశ్లేషించాలని, దహనం చేయడంలో ఎవరు చేశారన్నది త్వరగా విచారించాలని కోరారు. కార్యక్రమంలో పైడి వేణుగోపాలరావు, శివ్వాన ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పండి యోగీశ్వరరావు, పైడి సింధూర, జనసేన నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

జయపురంలోని ఒడియా మేదరి వీధి, డొంగాగుడలోని అన్నపూర్ణనగర్‌లో ఆక్రమణలను మున్సిపల్ సిబ్బంది బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా స్థానికులు అడ్డుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. దేవీ మందిరాన్ని జేసీబీలతో తొలగించడంపై స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కార్యనిర్వాహక అధికారి కృతి బాస్ సాహు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

– జయపురం



ఆలయం తొలగింపుపై అదనపు కార్యనిర్వాహక అధికారికి వివరిస్తున్న ఇంజనీర్



జేసీబీని తొలగిస్తున్న సిబ్బంది



అన్నపూర్ణ నగర్‌లో ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఇళ్లను కూలుస్తున్న దృశ్యం



ఆక్రమణల తొలగింపులో పాల్గొన్న పోలీసులు, సిబ్బంది

● ఆదిత్యుడి కర్ఫ్యూ

సూర్యుడు అప్రకటిత కర్ఫ్యూ విధించాడు. రెండు రోజులుగా నిప్పుల వాన కురిపిస్తూ బయటకు రావడానికి కూడా భయపడేలా రెచ్చిపోతున్నాడు. మధ్యాహ్నం వేళ తీక్షణమైన కిరణాలతో దాడి చేస్తున్నాడు. సూరీడి ధాటికి రోడ్లన్నీ ఇలా నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. శ్రీకాకుళంలోని సూర్య మహల్ కూడలి గత రెండు రోజులుగా ఇలా ఖాళీగానే దర్శనమిస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



ఆరు అడుగుల పుస్తకం ఆవిష్కరణ

గార:

తెలుగు భాషా విజ్ఞానానికి సంబంధించి ఆరు అడుగుల పెద్ద పుస్తకాన్ని బుధవారం ఉపాధ్యాయు లు, విద్యార్థులు ఆవిష్కరించారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా అంపోలు పంచాయతీ ఆడవరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం భోగెల ఉమామహేశ్వరరావు ఈ పుస్తకాన్ని తయారు చేశారు. వీటిలో అక్షర వర్ణమాల, గుణింత పేర్లు, పదాలు, పద్యాలు, గురజాడ, గిడుగు, వేమన వంటి సాహిత్య కవుల చరిత్రలు, పాఠశాల ప్రగతికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరిచారు. పుస్తక జ్ఞానంలో మనిషి విద్యావంతుడు అవుతాడన్నారు.



ఆడవరం పాఠశాలలో ఆరు అడుగుల పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఫిట్‌లెస్ సెంటర్

శ్రీకాకుళం రూరల్:

- శ్రీకాకుళం శివారులో వాహన ఫిట్‌నెస్ సెంటర్
- ఏజెంట్ కోడ్‌తో బుక్ చేసుకుంటేనే ఫిట్‌నెస్ మంజూరు
- ఆర్టీఏ అధికారుల అనుమతి లేకుండా ప్రైవేటు సంస్థ పేరుతో పత్రాల జారీ
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు



నాగావళి నదీ తీరాన గుజరాతీపేటలో ఫిట్‌నెస్ కేంద్రం

ఇటీవల ఓ ప్రైవేట్ బస్సు కొందరు పాసింజర్లతో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తుండగా మార్గమధ్యంలో బ్రేక్ ఫెయిల్ కావడంతో తుప్పల్లోకి దూసుకుపోయింది. దీంతో ప్రయాణికులకు చిన్నచిన్న గాయాలయ్యాయి. అంతకు వారం రోజుల కిందటే బస్సుకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించినట్లు డ్రైవర్ తెలిపారు. ఆరా తీస్తే ఆ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చింది శ్రీకాకుళం శివారులోని ఓ ఫిట్‌నెస్ సెంటర్ అని తెలిసింది. ఎవరూ టెస్ట్ డ్రైవ్ చేయకుండా, మిషన్లతో పూర్తిస్థాయిలో పరీక్షించకుండా కేవలం మాన్యువల్‌గా పరీక్షించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇదే ప్రమాదానికి కారణం.

ఆర్టీఏ అధికారులెక్కడ..?

ఒకప్పుడు బస్సుకు గానీ, లారీలకు గానీ చివరికి ఆటోలకు సైతం ఫిట్‌నెస్‌లు చేయించాలంటే నేరుగా అనుభవం ఉన్న ఆర్టీఏ అధికారి ఆ వాహనాన్ని కొంతమేర డ్రైవింగ్ చేసేవారు. తర్వాతే సర్టిఫికెట్ ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ప్రైవేట్ యాజమాన్య సంస్థలు లోపాలు గుర్తించడం లేదు. నామమాత్రంగా కొన్ని టెస్టులు చేసి అనుమతులు ఇచ్చేస్తున్నారు. నగరంలోని నాగావళి నదీ తీరాన, ఫాజుల్‌బేగ్ ప్రాంతం అగ్రికల్చర్ కార్యాలయం పరిధిలో వాహన ఫిట్‌నెస్ సెంటర్లకు కొన్ని నెలల కిందట అనుమతులు ఇచ్చారు. ఇక్కడ వివిధ రకాలైన ట్రాన్స్‌పోర్టు (ఎల్లోబోర్డు) వాహనాలన్నింటికీ మిషనరీతోనే బండి కండీషన్‌లకు పర్మిషన్లు ఇస్తున్నారు. ఇక్కడ అనుభజ్ఞులైన ఆర్టీఏ అధికారులంటూ ఎవ్వరూ లేరు. ప్రైవేట్ యాజమాన్య సంస్థ పెట్టుకున్న సిబ్బందితోనే తూతూ మంత్రంగా వాహనాలకు ఫిట్‌నెస్‌లు జారీ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఫిట్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు చేసినప్పటికీ ఆటో నుంచి తోక లారీ వరకూ ఎలాంటి వాహనానికైనా ఫిట్‌నెస్‌కు సంబంధించిన అన్ని అనుమతులు ఆ ప్రైవేట్ యాజమాన్య సంస్థే ఫిట్‌నెస్‌లు ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఆర్టీఏ అధికారుల పాత్ర, అప్రూవల్ అంటూ ఏమీ లేకుండా పోయింది.



ఫిట్‌నెస్ కేంద్రానికి వాహనాలు వెళ్తున్న దృశ్యం

ఏజెంట్లకు పండగే

ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఫిట్‌నెస్ సెంటర్ ఏర్పాటు కావడంతో ఏజెంట్ల ఆశలు చిగురించాయి. వారు ఇచ్చిన టోకెన్ నంబర్ ఆధారంగానే ఏదైనా బండికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు త్వరితగతిన వచ్చేస్తున్నాయి. పొరపాటున నేరుగా ఆన్‌లైన్ ద్వారా ఎఫ్‌సీకు సంబంధించిన స్లాట్‌ను వాహన యజమాని బుక్ చేసుకుంటే అది పూర్తిగా ఫెయిల్ అవ్వాల్సిందే. ప్రభుత్వ ఆధీనంలో ఫిట్‌నెస్‌లు ఇచ్చేటప్పుడు మాత్రం ఈ పరిస్థితి ఉండేది కాదు. ఒకసారి స్లాట్ బుక్ చేసుకుంటే రెండోరోజుకు కూడా మా ర్చుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం ఫిట్‌నెస్ సెంటర్‌లో ఆ పరిస్థితి లేకుండా పోయింది.

భారీ దోపిడీ

కేంద్రంలో వివిధ రకాలైన వాహనాలపై భారీ దోపిడీ జరుగుతోంది. ఇదంతా ఏజెంట్ల ద్వారానే కమిషన్ పద్ధతిలో నడుస్తోంది. స్థానికంగా ఏర్పాటు చేసిన రేట్లు కంటే అధిక రేట్లకు ముందస్తుగానే ఏజెంట్ ద్వారా డబ్బులు లాగేస్తున్నారు.

ఒక్క రోజులోనే నంబర్ ప్లేట్ల జారీ

వాస్తవంగా ఏదైనా బండి ఫిట్‌నెస్ కేంద్రానికి వెళ్తే హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్‌లు తప్పనిసరి. ఇది బండి కొన్న నెలరోజులకే షోరూంకు వస్తుంది. కానీ ఫిట్‌నెస్ కేంద్రంలో ఒక్క రోజులోనే నంబర్ ప్లేట్‌ను ఏర్పాటు చేస్తూ అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వీటితో పాటు రూ. 20 విలువ చేసే రిఫ్లెక్టివ్ రెడ్ టేపును బండికి అంటించడానికి రూ. 300 నుంచి రూ.500 వరకూ దోచేస్తున్నారు.

ఫిర్యాదులు మా దృష్టికి వస్తున్నాయి



ఫిట్‌నెస్ కేంద్రంపై ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్నపుడు బండి కండీషన్ చూస్తూ ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు అందించేవాళ్లం. ప్రస్తుతం సెంట్రల్ గవర్నమెంట్ ఆధీనంలో ప్రైవేట్ పరం చేశారు. మా పాత్ర అంటూ ఏమీ లేదు. – విజయ సారథి, డీటీసీ

టోకెన్ తీసుకున్నాం



ఆటో ఫిట్‌నెస్ కోసం ఏజెంట్‌కు రూ.3000 డబ్బులు ఇచ్చి ఫిట్‌నెస్ టోకెన్ తీసుకున్నాం. ఉదయం 10 గంటలకు ఫిట్‌నెస్ కేంద్రంలో బండి పెట్టాను. మధ్యాహ్నం 3 గంటలకు బండి ఇచ్చారు. గతంలో ప్రభుత్వ ఆధీనంలో బండి ఫిట్‌నెస్ చేసుకుంటే రూ.1000తోనే సరిపోయేది. గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం ఉండేది కాదు. ఇక్కడ ప్రతి దానికి అధికంగా డబ్బులు కట్టాల్సిందే.

– మురళి, ఆటో డ్రైవర్

‘ఆపరేషన్ కగార్ ఆపాల్సిందే’



మేడే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రగతి శీల కార్మిక సమాఖ్య ప్రతినిధులు

పలాస: దండకారణ్యంలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య డిమాండ్ చేసింది. పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో బుధవారం మేడే కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని ఊరూవాడల్లో కార్మిక పతాకాలను ఆవిష్కరించి ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. కనీసం వేతనం రూ.26వేలు చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పురుషులతో పాటు మహిళలకు సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధనరావు, అధ్యక్షుడు మద్దిల ధర్మారావు, దాసరి నారాయణమూర్తి, మామిడి గణపతి, గూడ మన్మథ, డొక్కర లక్ష్మణ, తామాడ గంగయ్య, మురిపింటి గంగయ్య, దాసర దానేసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికను కాపాడిన కానిస్టేబుల్

• ప్రశంసాపత్రం అందజేసిన ఎస్పీ



కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, చిత్రంలో నగర డీఎస్పీ శ్రీనివాస్, టూటౌన్ సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: నగరంలో ఆత్మహత్యాయత్నం చేసుకోబోయిన ఓ బాలికను టూటౌన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఆర్.జగదీష్ కాపాడినందుకు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తన చాంబర్‌లో ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. డయల్ 112కు వచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో 17 ఏళ్ల బాలిక తలుపులేసుకుని ఆత్మహత్యకు యత్నిస్తున్న సమాచారాన్ని కానిస్టేబుల్ జగదీష్ అందుకున్నారు.సీఐ శ్రీనివాస్ ఆదేశాలతో ఆ అడ్రస్‌కు వెళ్లి సదరు బాలికను ఆత్మహత్యాయత్నం నుంచి కాపాడారు. విచారణలో బాలిక చదువును నిర్లక్ష్యం చేయడం, స్నేహితులతో ఎక్కువ సమయం గడుపుతున్నందున తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తేలింది. ఎస్పీ ఆదేశాలతో టూటౌన్ సీఐ శ్రీనివాస్ బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

పాచిపెంటలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన



కుడుమూరు భూ సమస్య పరిష్కరించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పాచిపెంట: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పాచిపెంట మండలంలో బుధవారం పర్యటించారు. మండలంలోని పెద్దగెడ్డ నిర్వాసితుల సమస్య పరిష్కరించాలని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. అలాగే పెద్దగెడ్డ జలాశయం గిరిజన మత్స్యకారులకు లైఫ్ జాకెట్స్, వలలు, పడవలు ప్రభుత్వం నుంచి ఉచితంగా అందజేయాలని కోరారు. కుడుమూరు రెవెన్యూ సర్వే నంబర్ 48లో గిరిజనులు సాగుచేస్తున్న సుమారు ఎనిమిది వందల ఎకరాల భూమికి సంబంధించి గిరిజన రైతులకు పట్టాలు అందించాలని, గిరిజన రైతు సూకురు అప్పలస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంట స్థానిక తహసీల్దార్ డి.రవి, ఆర్ఐ రమణ ఉన్నారు.

మహిళపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడిని కోర్టుకు తరలిస్తున్న సీఐ తిరుపతిరావు, ఎస్సై అనీష్

జియ్యమ్మవలస: మహిళను బ్లాక్‌మెయిల్ చేస్తూ లైంగిక దాడికి పాల్పడిన చినమేరంగి గ్రామానికి చెందిన సిరిపురపు నానిని చినమేరంగి ఎస్సై పి.అనీష్ అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ మేరకు చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన వివాహితను బ్లాక్‌మెయిల్ చేస్తూ పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన సిరిపురపు నానిపై బాధితురాలు, ఆమె భర్త ఇటీవల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించి నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి కోర్టుముందు హాజరు పర్చామని తెలిపారు. నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని సీఐ చెప్పారు. మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన, లైంగికదాడులకు పాల్పడితే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోక్సో కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస గ్రామానికి చెందిన సామల నవీన్ అనే వ్యక్తికి పోక్సోకేసులో పదేళ్ల జైలు శిక్ష పడిందని ఎస్సై అనీష్ తెలిపారు. ఈ మేరకు ఆయన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముద్దాయి సామల నవీన్(26)పై 25.3.2021లో చినమేరంగి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి కోర్టు విజయనగరం వాదోపవాదనల తరువాత నేరారోపణ రుజువు కావడంతో పదేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నాగమణి బుధవారం తీర్పు వెల్లడించారు. ముద్దాయికి శిక్ష పడేవిధంగా దర్యాప్తు నిర్వహించిన సీఐ తిరుపతిరావు, ఎస్సై బి.శివప్రసాద్, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచిన ఎస్సై అనీష్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు.

అప్రోచ్ రోడ్డు రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

• కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

పూసపాటిరేగ: విమానాశ్రయానికి వెళ్లే రహదారిలోని రైతుల సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు విమానాశ్రయానికి సంబంధించిన వివిధ సమస్యలపై అప్రోచ్ రోడ్‌లో గుడెపువలస, రావివలస అమటాం, సవరవిల్లి, దల్లిపేట,బైరెడ్డి పాలెం గ్రామాలకు చెందిన రహదారిలో బుధవారం ఆయన పర్యటించారు. ప్రధాన సమస్య అయిన విమానాశ్రయానికి వెళ్లే అప్రోచ్ రోడ్డులో పొలాల్లోకి రహదారి సౌకర్యం కల్పించాలని రైతులు, నాయకులు కోరారు. అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా భూమి ఎంత ఉందో కొలతలు వేయాలని అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. అలాగే అప్రోచ్ రోడ్డు రహదారికి భూములు ఇచ్చినప్పటికీ కోర్టు వివాదంలో పరిహారం అందలేదని నాయకులు మట్ట అయ్యప్ప రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, యర్ర అప్పల నారాయణ తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కూడా అధికారులతో మాట్లాడి పరిహారం వచ్చేలా చూస్తానని కలెక్టర్ చెప్పారు. గతంలో విమానాశ్రయ ఆర్ అండ్‌ఆర్ కాలనీలకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ 22ఏ లో ఉండడంతో బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్‌డీఓను కలెక్టర్ ఆదేశించారు.

ప్రతిపాదనలు పంపండి

అలాగే అప్రోచ్ రోడ్డు నుంచి అమకాం గ్రామానికి వెళ్లేందుకు రహదారి కావాలని ఆ గ్రామ నాయకులు కోరడంతో సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంపాడపేట శ్మశాన వాటిక సమస్య ఆయన దృష్టికి రావడంతో స్థలాన్ని ఖరారు చేసి పంపితే అనుమతులు ఇస్తానని చెప్పారు. అమటాం రావివలస వద్ద అండర్ పాత్ కావాలని గ్రామస్తులు కోరగా అందుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. విమానాశ్రయ నిర్మాణానికి భూములు ఇచ్చిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎయిర్‌పోర్ట్ ప్రతినిధులు రామరాజు, సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి, నాయకులు సూర్యనారాయణ మూర్తి రాజు, కోరాడ తాతారావు, కొత్తయ్య రెడ్డి, కొల్లి రామ్మూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో హేమలత

• బీఎల్ఏలను నియమించుకోవాలి
• రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరిన డీఆర్ఓ

పార్వతీపురంటౌన్: జిల్లాలో అవసరమైన చోట్ల నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా బీఎల్‌ఓలకు సంపూర్ణ సహకారం అందించాలని, బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం సూచించిన ప్రొఫార్మాలో ఏజెంట్ల నియామకానికి సంబంధించి వివరాలు పంపాలని ఆమె కోరారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన చాంబర్‌లో బుధవారం డీఆర్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నాటికి ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు 800–1200 మంది ఓటర్ల ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఓటర్లకు 2 కి.మీ లోపల పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో ఓటర్లకు అనువుగా ఉండే ప్రాంతాలను గుర్తించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆమె కోరారు. అదేవిధంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి వివరాలను అందజేస్తూ బీఎల్‌ఓలకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



ఎక్సైజ్ శాఖ సిబ్బందితో సమీక్షిస్తున్న సహాయ కమిషనర్ రామచంద్రరావు

• ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పైడి రామచంద్రరావు

కొత్తవలస: విజయనగరాన్ని సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ పైడి రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కొత్తవలస మండల కేంద్రంలో గల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులను, నమోదవుతున్న కేసుల వివరాలను పరిశీలించి తగు సూచనలు సలహాలను అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం-2.0 కార్యక్రమాన్ని వచ్చేనెల 3వ వారంలోగా పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు.స్టేషన్ పరిధిలో గల వేపాడ, కొత్తవలస, లక్కవరపుకోట మండలా పరిధిలోని గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు.

గ్రామాల్లో బెల్లం అమ్మకాలు చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. బెల్లం వ్యాపారస్తులు ప్రతి 15 రోజులకు ఒక పర్యాయం బెల్లం అమ్మకాలకు సంబంధించిన నివేదికలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమర్పించాలని స్పష్టం చేశారు. సిబ్బంది సారా తయారీ దారులతో కుమ్మక్కైనట్లు రుజువైతే వేటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ జీఎస్.రాజశేఖర నాయుడు, ఎస్సైలు వీఎస్.రాజు, ఎస్.రమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

160లీటర్ల సీరాతో వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ ఎస్సై రాజశ్రీ

పార్వతీపురంటౌన్: 160లీటర్ల సీరా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాజశ్రీ తెలిపారు. ఈ మేరకు బుధవారం కృష్ణపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా 160 లీటర్ల సారా దొరకడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడి బైక్ సీజ్ చేసి కేసు నమెదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో హెచ్‌సీ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

• పదవ తరగతిలో ఫెయిలవుతానని భయం



దుర్గాప్రసాద్ మృతదేహం

రామభద్రపురం: చెన్నై వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటూ చదివిస్తున్న తల్లిదండ్రులకు ఓ బాలుడు తీరని శోకం మిగిల్చాడు. పదవ తరగతి ఫలితాల్లో ఫెయిల్ అవుతానేమోనన్న భయంతో రిజల్ట్స్ రాకముందుగానే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామభద్రపురం మండలంలోని కొట్టక్కిలో మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొట్టక్కి గ్రామానికి చెందిన కర్రి దుర్గాప్రసాద్(15) తల్లిదండ్రులు పార్వతి, పార్వతీశం చెన్నై వలస వెళ్లడంతో కొట్టక్కిలోని అమ్మమ్మ పెంటమ్మ వద్ద ఉంటూ అక్కడే ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. మార్చిలో పదోతరగతి వార్షిక పరీక్షలు రాశాడు. అయితే ఆ పరీక్ష ఫలితాలు 23న విడుదల కానున్నాయని ప్రకటన వెలువడడంతో ఫెయిలవుతానని భయంతో ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి వెంటనే సాలూరు సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. విద్యార్థి అనుమానించినట్లుగానే పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అమ్మమ్మ పెంటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం కనుగొన్నారు. ఇందుకు సంబంధించి జీఆర్‌పీ సిబ్బంది ఇచ్చిన వివరాల మేరకు విజయనగరం రైల్వేస్టేషన్‌లోని 4వ నంబర్ ఫ్లాట్‌ఫాం వద్ద నాలుగో రైల్వేలైన్ వద్ద సుమారు 5.6 అడుగుల మృతదేహం పడి ఉంది. చామన ఛాయ రంగు, లేత నీలిరంగు దుస్తులు ధరించి ఆ వ్యక్తిని ఎవ్వరూ గుర్తించకపోవడంతో తామే మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9490617089,6301365605 నంబర్లు, ల్యాండ్ లైన్ నంబర్ 0891-2883218 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో పారిశుధ్య కార్మికుడి మృతి



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన భీముడు

భామిని: మండలంలోని తాలాడకు చెందిన పారిశుధ్య కార్మికుడు గొర్లె భీముడు(52) బుధవారం సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ మృత్యువాత పడ్డాడని బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన తగాదాలో గాయపడి అపస్మారకస్థితిలో పడి ఉన్న గొర్లె భీముడు(52)ను ఆస్పత్రికి తరలించినట్లు ఆయన భార్య రోదిస్తూ తెలిపిందని చెప్పారు. ఈ సంఘటనపై పాలకొండ సీఐ చంద్రమౌళి తాలాడ గ్రామాన్ని సందర్శించి సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్‌టీమ్‌కు వివరాలు అందివ్వాలని గ్రామస్తులను సూచించారు. గొర్లె భీముడు(52) మృతిపై భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పాలకొండ ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన 'తోషిని'

• రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న తోషిని

తెర్లాం: రాష్ట్రస్థాయిలో జరుగుతున్న దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్ భారత్-2025 పోటీల్లో తెర్లాం హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అడ్డా తోషిని 'బోసి గేమ్' వ్యక్తిగత హయ్యర్ ఎబిలిటీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకోడంతోపాటు, దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్ భారత్-2025 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ంది. ఈ నెల 21-23వరకు నూజివీడులోని అగిరిపల్లి హిల్ పారడైజ్ స్కూల్‌లో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ రాష్ట్ర స్పెషల్ ఒలింపిక్స్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తెర్లాం హైస్కూల్ నుంచి రాష్ట్రస్థాయి బోసి గేమ్ పోటీలకు హాజరైన తోషిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. అలాగే జూలై నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం తరపున ఎంపికైంది. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించి ప్రథమ స్థానంలో నిలిచిన ఆమె సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంది. ఈ సందర్భంగా తోషినిని రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు, జిల్లా, మండల విద్యాశాఖాధికారులు, తెర్లాం హైస్కూల్ హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు, స్పెషల్ ఎడ్యుకేటర్, ఎస్కార్ట్ సునీల్ అభినందించారు.



బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం సాధించిన విజయకుమార్

బ్యాడ్మింటన్‌లో కాంస్యపతకం

దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్ భారత్-2025 రాష్ట్రస్థాయి పోటీల్లో తెర్లాం హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి కొప్పర విజయకుమార్ బ్యాడ్మింటన్ క్రీడలో రాష్ట్రస్థాయిలో తృతీయస్థానాన్ని సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. విజయకుమార్‌కు రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ సంచాలకుడు శ్రీనివాసరావు పతకాన్ని అందజేసి అభినందించారు.

వైభవంగా కోదండ రామ స్వామి వార్షిక కల్యాణం



కొండపై ఆలయంలో స్వామివారి కల్యాణ వేడుకను జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని నీలాచలం పర్వతంపై ఉన్న కోదండ రామాలయంలో శ్రీ కోదండ రాముడి వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. బహుళ దశమిని పురస్కరించుకుని ఏటా కొండపై ఆలయంలో కోదండుడి కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో స్వామికి వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత స్వామివారి ఉత్సవ మూర్తులను ఆస్థాన మంటపంలో వేంచేపు చేసి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వైఎస్సార్‌నగర్‌కు వెళ్లే దారిలో గల శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ పల్లి నల్లనయ్యను బుధవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఎలక్ట్రికల్ బర్నింగ్ యంత్రం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కుమ్మరివీధి జంక్షన్ నుంచి శ్మశానికి రోడ్డు వేయాలని.. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.రంగరాజు, బూర వాసు, తదితరులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి..

విజయనగరం టౌన్: బ్రాహ్మణ సమాజాన్ని కించపరిచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర అధికార ప్రతినిధి వీఎస్ఎన్.కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రెండురోజుల కిందట కర్ణాటకలోని బీదర్, షిమోగా పట్టణంలో సీఈటీ ప్రవేశ పరీక్షకు హాజరైన బ్రాహ్మణ విద్యార్థులకు యజ్ఞోపవీతం ఉండడంతో పరీక్షకు అనుమతించకపోవడం దారుణమన్నారు. ఇది హిందూ ధర్మంపై ఒక పథకం ప్రకారం జరుగుతున్న దాడిగా పేర్కొన్నారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, పరీక్షకు హాజరు కాలేకపోయిన విద్యార్థులకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు సరోజిని, పురోహితుల విభాగం ఉపాధ్యక్షులు భమిడిపాటి రామ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మొబైల్ ట్రాకింగ్ సేవలు సులభతరం



సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

• జిల్లా కేంద్రానికి రాకుండా ఫిర్యాదు
• ప్రత్యేకించి వాట్సాప్ నంబర్ విడుదల

విజయనగరం క్రైమ్: గడిచిన ఆరునెలల్లో పోయిన మొబైల్ ఫోన్‌లను ఫిర్యాదుదారులకు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం పోలీస్‌కాన్ఫరెన్స్ హాలులో అందజేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.ఆరుకోట్ల విలువైన 3,300 సెల్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ మేరకు డీపీఓలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పోయిన మొబైల్ ఫోన్ కోసం ఫిర్యాదుకు ప్రత్యేకించి జిల్లా కేంద్రానికి రావనసరం లేదన్నారు. సైబర్‌సెల్ పోలీస్‌స్టేషన్‌కు కూడా వచ్చి ఫిర్యాదు చేయనవసరం లేదన్నారు. పోయిన సెల్‌ఫోన్‌లపై 8977945606 వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, ముందుగా హాయ్ అని మెసేజ్ చేస్తే మా శాఖే ఓ యూఆర్ఎల్‌ను పంపుతుందని అందులో ఫిర్యాదు దారు వివరాలు, ఫోన్ నంబర్ ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేస్తే మొబైల్ ట్రాకింగ్ సిస్టం ద్వారా ఫోన్ ట్రేస్ అవుట్ చేస్తామని ఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా 264 ఫోన్‌లను మొబైల్‌ట్రాకింగ్ విధానం ద్వారా ట్రేసవుట్ చేశామని తెలిపారు. ఫిర్యాదుదారులు సైబర్‌సెల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఐఎంఐఈ నంబర్ చెప్పి ఫోన్ పొందవచ్చని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, నగర డీఎస్పీ శ్రీనివాస్, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ లీలారావు, సైబర్ సెల్ ఎస్సై నజీమాబేగం, సైబర్ సెల్ సిబ్బంది వాసుదేవ్, తిరుపతి నాయుడు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో ముగ్గురికి రిమాండ్

పార్వతీపురం రూరల్: పట్టణంలో మద్యం మత్తులో దాడి చేసిన ముగ్గురు వ్యక్తులకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ కోర్టుతీర్పు వెలువరించినట్లు పట్టణ ఎస్సై గోవింద తెలి పారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడిస్తూ పట్టణంలోని కొత్తవలస ఫ్లైఓవర్ సమీపంలో ఉంటున్న ఒక కుటుంబాన్ని సిరిపురపు నారాయణ, ఎర్నాగుల జయంత్‌కుమార్, పులి తరుణ్‌లు దౌర్జన్యంగా కొడుతుండగా సమీపంలో వ్యక్తులు అడ్డగించారు. అడ్డగించిన వారిపై కూడా ఆ ముగ్గురు వ్యక్తులు దాడి చేయడంతో వారు తీవ్ర గాయాలపాలై జిల్లా కేంద్రాస్పత్రిలో చేరారు. ఈ మేరకు వైద్యులు ధ్రువీకరించడంతో దాడికి పాలపడిన ముగ్గురిని న్యాయస్థానం ముందు పోలీసులు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు నిందితులను జైలుకు తరలించామన్నారు.

ఏఓబీలో ఎక్సైజ్ దాడులు



ఏఓబీ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఒడిశా సరిహద్దు గ్రామాలైన సందుబడి, తుంబాలిభాయ్, పనుసత్ర గ్రామాల్లో విస్తృతంగా దాడులు జరిపి 7,700 లీటర్ల బెల్లపు ఊట, 360 లీటర్ల సారాను గుర్తించి ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు తెలిపారు. అలాగే 3వేల కేజీల విప్పపువ్వు, 2,400 కిలోల నల్ల బెల్లం, 3,900 కిలోల అమోనియం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిషాంత్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాహుల్ దేశ్ శర్మ ఆదేశాల మేరకు పార్వతీపురం జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విజయనగరం-ఒడిశా రాష్ట్ర ఎక్సైజ్ సిబ్బంది, కురుపాం, జీఎల్‌పురం పోలీస్ సిబ్బంది సహకారంతో విస్తృత దాడులు జరిపినట్లు తెలిపారు. బెల్లం ఊట, సారా, విప్పపువ్వు, నల్ల బెల్లం, అమోనియం స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు వ్యక్తులపై రెండు కేసులను నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. డ్రోన్ కెమెరాను ఉపయోగించి సారా తయారీ కేంద్రాలను గుర్తించి, దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో కురుపాం, సీతానగరం, సాలూరు, విజయనగరం, ఈఎస్‌టీఎఫ్ సాలూరు మొబైల్ పార్టీ, పార్వతీపురం మన్యం అధికారులు, సిబ్బంది, ఒడిశా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.